క్లుప్తంగా

వైద్యం నిమిత్తం ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు

బుట్టాయగూడెం: మండలంలోని ఓ వ్యక్తి వైద్యానికి ఎమ్మెల్యే బాలరాజు దంపతులు ఆర్థిక సహాయం అందజేశారు. కోయఅంకం పాలెం గ్రామానికి చెందిన తామా భీమరాజు అనే గిరిజనుడికి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రాగా ఏలూరు ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అయితే భీమరాజుకు మెరుగైన వైద్యం కోసం దుద్దుకూరు క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మిల చేతులమీదుగా బుధవారం ఆర్థిక సహాయం చేశారు. అలాగే రాజమండ్రిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి భీమరాజును పంపించారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు.

దేవాలయాలు.. ఆధ్యాత్మిక కేంద్రాలు



కృపగల తల్లి మందిరం వార్షికోత్సవంలో పూజలు చేస్తున్న ఫాదర్ బాల

లింగపాలెం: దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు అని.. సమాజంలో రుగ్మతలను రూపుమాపటానికి దోహదపడతాయని ఏలూరు ఫాదర్ పి బాల అన్నారు. లింగపాలెం మండలం పుప్పాలవారిగూడెం గ్రామంలో బుధవారం కృపగల తల్లి మందిరం 5వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ బాల ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఫాదర్లు, పాస్టర్లు సమిష్ఠ దివ్యబలి పూజ నిర్వహించారు. అనంతరం ఫాదర్ బాల మాట్లాడుతూ క్రీస్తు చూపించిన ప్రేమను ఇతరులకు పంచి సహోదరభావంతో కలసిమెలసి జీవించాలన్నారు. సమాజాభివృద్ధికి అంకితభావంతో పనిచేసేందుకు యువత చొరవ చూపాలన్నారు. క్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరించాలని బాల పిలుపునిచ్చారు. అనంతరం సంఘస్తులు, పాస్టర్లు కలసి ఫాదర్ బాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విచారణ గురువులు హెచ్చు ఏసురత్నం, పలువురు ఫాదర్లు, పాస్టర్లు, సంఘపెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఆళ్ల నానిని కలిసిన కంభం విజయరాజు



ఏలూరులో ఆళ్ల నానిని మర్యాదపూర్వకంగా కలిసిన విజయరాజు

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పార్టీకి శ్రీరామరక్షగా నిలుస్తాయని, రాబోయే 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరు జిల్లాలో అన్ని స్థానాలు కైవసం చేసుకుంటామని ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని ధీమా వ్యక్తం చేశారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్‌గా నియమితులైన కంభం విజయరాజు బుధవారం ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నానిని మర్యాదపూర్వకంగా కలిసి పూలకుండీ అందజేశారు. ఈ సందర్భంగా చింతలపూడి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై కొద్దిసేపు చర్చించారు. అనంతరం ఆళ్ల నాని మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువగా ఉంటూ నియోజకవర్గంలో పార్టీ నాయకులు, క్యాడర్‌తో సన్నిహితంగా మెలుగుతూ అందరినీ కలుపుకుని వెళ్లాలని సూచించారు. చింతలపూడిలో వైఎస్సార్ సీపీ జెండా మరోసారి ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

శ్రీకృష్ణదేవరాయల జీవితం నేటి తరానికి ఆదర్శం

భీమడోలు: ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు సంత మార్కెట్ వద్ద బుధవారం శ్రీకృష్ణదేవరాయల కాపు యువత ఆధ్వర్యంలో సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయల 533వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల పరిపాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండేవారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత పాలకులు సంక్షేమ పథకాలు అమలు చేయడం చాలా సంతోషదాయమన్నారు. నేటి తరం రాజకీయ నాయకులకు కృష్ణదేవరాయల పాలనాదక్షత ఆదర్శంగా నిలుస్తుందన్నారు. వైఎస్సార్సీపీ మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, నాయకులు యర్రంశెట్టి ఏడుకొండలు, ఈతకోట బాబి, తాతాజీ, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, శివరాం, పట్టాభి, చింతా సత్యకృష్ణ, పసుపులేటి శ్రీను పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలు... సేవా నిలయాలు

- సచివాలయాల ఏర్పాటుతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలన
- అందుబాటులో 12 శాఖల సిబ్బంది
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు



బుట్టాయగూడెం మండలం అటవీప్రాంతంలో ప్రభుత్వ పథకాలను అందుకున్న గిరిజనులు (ఫైల్)

బుట్టాయగూడెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన తర్వాత గ్రామ స్థాయిలో ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి చేకూరేలా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. రేషన్ కార్డు నుంచి పలు రకాల ధ్రువీకరణ పత్రాలు అందేలా, ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా ఈ సచివాలయ వ్యవస్థ దోహదపడుతోంది. గత ప్రభుత్వ పాలనలో ఏ పని కావాలన్నా ప్రజలు దూరాభారాన ఉన్న మండల కేంద్రాలకు కాళ్లు అరిగేలా తిరగాల్సి వచ్చేది. ముఖ్యంగా పోలవరం నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతంలో కొండ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు కొండలు, గుట్టలు దాటుకుంటూ మైళ్ల దూరం కాలినడకన నడుచుకుంటూ ప్రభుత్వ కార్యాలయాలకు చేరుకుని పత్రాలు తీసుకునేందుకు అనేక ఇబ్బందులు పడేవారు. అటువంటి పరిస్థితులకు చెక్‌పెడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామ సచివాలయాల ఏర్పాటుతో గ్రామ స్థాయిలోనే అన్ని రకాల సేవలు అందుతూ ఉన్నాయి. దీనితో మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం దిశగా నేడు అడుగులు పడుతున్నాయి. సచివాలయాల్లో ప్రజల ముంగిటే ప్రభుత్వ పాలన సాగడంతో ప్రజలు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సేవలన్నీ ఒకే చోట

పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాలు ఉన్నాయి. వీటిలో సుమారు 107 గ్రామ సచివాలయాలను సుమారు రూ.44 కోట్ల 87 లక్షలతో నూతన భవనాలను నిర్మించడం జరిగింది. సుమారు 164 మంది గ్రామ సచివాలయ ఉద్యోగులు, 1667 మంది గ్రామ వలంటీర్‌లు పనిచేస్తున్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోనూ ప్రజలకు అక్కడికక్కడే సులువుగా పరిష్కారంతోపాటు మెరుగైన సేవలు అందించేలా కృషి చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామసచివాలయ వ్యవస్థ వల్ల గత పరిస్థితుల్లో పూర్తి మార్పు రావడంతో ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. గ్రామస్థాయిలో పనులు జరగడంతో తమ వ్యయ ప్రయాసల బాధ తప్పిందని ప్రజలు సంతోషంగా చెబుతున్నారు.



రేపల్లెలో మంచానికి పరిమితమైన లబ్ధిదారుడికి పింఛను అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)



బుట్టాయగూడెంలో నిర్మించిన గ్రామ సచివాలయం

ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ సేవలు

గత ప్రభుత్వం ఏ పథకం అమలు చేస్తుందో వాటికి ఎలా దరఖాస్తు చేసుకోవాలో, ఎవరిని సంప్రదించాలో అనే విషయం ఎవరికీ తెలిసేది కాదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి వారి ద్వారా నేరుగా ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించి వారే దరఖాస్తులను పూర్తి చేసి సంక్షేమ ఫలాలను ప్రతి గడపకూ చేరుస్తున్నారు. చివరకు వృద్ధులు, వితంతువులు, పింఛన్లను ప్రతి నెలా 1వ తేదీన తెల్లవారక ముందే అర్హులకు అందజేస్తున్నారు. అటవీప్రాంతంలోని కొండల్లో నివసిస్తున్న అర్హులకు కూడా తెల్లవారకముందే పింఛన్లు అందించడం జరుగుతుంది.

అన్ని రకాల సేవలు అందుతున్నాయి



గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్నాం. సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలన్నీ ప్రజల చెంతకే చేరుతున్నాయి. సిబ్బంది అందుబాటులో ఉంటూ అన్ని విధాల సేవలు అందిస్తున్నారు. వలంటీర్‌ల ద్వారా మారుమూల గ్రామాల్లో సైతం పథకాలు అందిస్తున్నాం.

– ఎం. శ్రీహరి, ఈఓపీఆర్‌డీ, బుట్టాయగూడెం మండలం

సచివాలయ వ్యవస్థ బాగుంది



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్‌లు, సచివాలయ వ్యవస్థ చాలా బాగుంది. సచివాలయం ద్వారా అన్నిరకాల ధ్రువీకరణ పత్రాలు గ్రామస్థాయిలోనే అందుతున్నాయి. ఈ వ్యవస్థను ఎప్పటికీ కొనసాగించేలా కృషి చేయాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డిని కోరుతున్నాం.

– పూసం గంగారత్నం, తూర్పురేగులకుంట, బుట్టాయగూడెం మండలం

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాత లక్ష్మణరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు బుధవారం రూ.1,50,000 విరాళంగా అందజేశారు. తిరువూరుకు చెందిన పొట్లూరి లక్ష్మణరావు ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

దెందులూరు: కోస్తా జిల్లాలో భక్తుల పూజలు అందుకుంటున్న గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మవారి ఉత్సవాలను విజయవంతం చేయాలని గాలాయగూడెం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు కోరారు. బుధవారం దెందులూరులో వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 16 నుంచి 9 రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇటీవల ఉత్సవాల వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి విడుదల చేశారన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

శీతాకాలం.. పశువులు భద్రం!



ద్వారకాతిరుమలలో ఆవుకు వైద్యం చేస్తున్న మండల పశువైద్యాధికారి సురేష్, సిబ్బంది



రామన్నగూడెంలో గాలికుంటు వ్యాధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యులు (ఫైల్)

ద్వారకాతిరుమల: శీతాకాలంలో పశువులకు పలు రకాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండడంతో పశుసంరక్షణకు తగిన జాగ్రత్తలు తప్పనిసరి. కొత్త గడ్డిని మేసే పశువులు, గొర్రెలు, మేకలు బలహీనంగా తయారవుతాయి. సకాలంలో తగిన వైద్యం అందిస్తే పశువులను కాపాడుకోవచ్చని మండల పశువైద్యాధికారి అంగర సురేష్ చెబుతున్నారు. సీజనల్ వ్యాధుల నుంచి పశువులను సంరక్షించుకోవాలని పాడి రైతులకు పలు సూచనలు చేశారు.

గురక లేక గొంతువాపు

బ్యాక్టీరియా సూక్ష్మజీవి కారణంగా పశువుల్లో గురక లేదా గొంతువాపు వ్యాధి వస్తుంది. పశువులకు గెడ్డం కింద వాపు, కళ్లు ఎర్రపడటం, ముక్కు నుంచి తీగలు కారడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడతాయి. ఈ వ్యాధి నివారణకు సల్ఫాడిమిడిన్, ఇంటాసెఫ్‌టాజు మందులను వాడాలి. ముందస్తు టీకాలు వేయించి అరికట్టవచ్చు.

గాలికుంటు వ్యాధి

పికార్నో వైరస్‌తో పశువుల్లో గాలికుంటు వ్యాధి సంక్రమిస్తుంది. గిట్టలు ఉన్న పశువులకు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. నోటిలో, కాళ్లలో పుండ్లు ఏర్పడిన పశువులు నడవలేకపోతాయి. దీని నివారణకు గాలికుంటు టీకాలు ఆరు నెలలకోసారి వేయాలి. వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. గిట్టల మధ్యలోని పండ్లను పర్మాంగనేట్ ద్రావణంతో శుభ్రం చేయాలి. బీస్ప్రెపెన్ మందు 2.5 గ్రాములు, ఎన్రోఫ్లాక్సిన్ 50 ఎంఎల్ మందులు వాడటంతో పాటు, వేప నూనె రాయడం వల్ల ఫలితం ఉంటుంది.

తిరుగుడు రోగం

రక్తంలోని ట్రిపనోజోమా పరాన్న జీవుల కారణంగా పశువుల్లో తిరుగుడు రోగం సంక్రమిస్తుంది. ఇది అన్ని రకాల పశువులకు వచ్చే అవకాశం ఉంది. దీని నివారణకు బేరెనిల్, ట్రిక్విన్, పెరిటాస్ మందులు వాడాలి.

సాధారణ చిట్కాలు

కాలానికి తగిన విధంగా ఆహారం, నీటిని అందిస్తూ పరిశుభ్ర వాతావరణంలో పశువులను ఉంచాలి. శీతాకాలంలో అధిక చలి నుంచి రక్షణ ఏర్పాట్లు చేయాలి. పశువులకు దాణాను కాస్త ఆలస్యంగా ఇవ్వాలి. నట్టల నివారణకు ముందస్తుగా మందులు తాగించాలి. ఎఫ్ఎండీ, హెచ్ఎస్, బీక్యూ టీకాలు తప్పనిసరిగా వేయించాలి. పశువుల పాకల్లో సూర్యరశ్మి పడేలా చూసుకోవాలి.

ముందస్తు జాగ్రత్తలతో సంరక్షణ



పశువుల పెంపకంలో ముందస్తు చర్యలు చేపట్టడంతోనే సంరక్షణ సాధ్యమవుతుంది. వేసవి కాలం నుంచే పశువులకు టీకాలు వేయించాలి. మేలైన యాజమాన్య పద్ధతులు, పోషణ విషయంలో శ్రద్ధ తీసుకోవడం ద్వారా శీతాకాలంలో పశువులను రక్షించుకోవచ్చు. పశు వైద్యుల సలహాల మేరకే మందులు వాడాలి. పాడి రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– అంగర సురేష్, మండల పశువైద్యాధికారి, ద్వారకాతిరుమల

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, జెడ్పీటీసీ పోలనాటి బాబ్జి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీ సోషల్ క్లబ్ ఆవరణలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతోపాటు గడపగడపకూ వైద్యసేవలు అందించేందుకు చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం లాంటిదని వివరించారు. జగనన్న ఆరోగ్య శిబిరంలో ప్రభుత్వమే అన్ని రకాల వైద్య సేవలు పేదలకు ఉచితంగా అందిస్తుందన్నారు. ఇది నిరంతర ప్రక్రియని అన్నారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్యసేవలు పొందాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు పి.గిరిబాబు గౌడ్, కౌన్సిలర్లు ఏవీఆర్ మూర్తి, కిషోర్ నాయకులు షేక్ అమీర్, విష్ణు, గణేష్, ఆదివిష్ణు, షేక్ అక్బర్, హఫీజ్ కఠారి సీతారాంబాబు, చిప్పాడ వెంకన్న, రాధాకృష్ణ, కమిషనర్ భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీటీసీ పోలనాటి బాబ్జి

జగన్ మళ్లీ సీఎం కావాలని పూజలు

ద్వారకాతిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారికి కొవ్వూరు మండలం కుమారదేవంకు చెందిన వైఎస్సార్ సీపీ ఎన్నారై, ఐటీ విభాగం రాష్ట్ర నాయకులు పసుపులేటి వీరభద్రరావు(బద్రి) బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి పూజాధికాలను జరుపుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నారసింహుడు తన ఇష్టదైవమన్నారు. భక్తులు స్వామి వారికి నైవేద్యంగా సమర్పించే పాలపొంగళ్లకు వండే షెడ్లను తాను నిర్మించినట్టు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని స్వామివారికి పూజలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, కరాటం చినరాయుడు, శాసనాల రాజేష్, పుప్పాల పుండరీకాక్ష తదితరులు న్నారు.



కుటుంబ సమేతంగా నారసింహునికి పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎన్నారై, ఐటీ విభాగాల రాష్ట్ర నాయకుడు బద్రి

‘చలో కడప’ను విజయవంతం చేయాలి

జంగారెడ్డిగూడెం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఎస్సీల ఏ.బీ.సీ.డీ వర్గీకరణ సమస్యను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి లాగు ప్రకాష్, ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కడిమి రాజేష్ కుమార్ కోరారు. బుధవారం వారు ఈమేరకు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈనెల 20వ తేదీన కడప పట్టణంలో నిర్వహించబోతున్న మాదిగల రాజకీయ సమన్వయ మహాసభకు రాష్ట్రంలోని మాదిగ, మాదిగ ఉప కులాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు ఉద్యోగులు, మహిళలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అణగారిన కులాలకు రాజ్యాధికారంలో అవకాశం కల్పించినప్పుడే ఆయా కులాల్లో కనీస అభివృద్ధికి నాంది పడుతుందని అన్నారు. జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ జిల్లా మెంబర్ ఉక్కుర్తి సీతారాం చేతుల మీదుగా కరపత్రాల పంపిణీని ప్రారంభించారు. మద్దిపాటి ఇస్సాకు, మద్దిపాటి వెంకటేష్, లాగు ప్రకాష్, గొల్ల మందల శ్రీనివాసరావు, కడిమి రాజేష్ కుమార్ పాల్గొన్నారు.



‘చలో కడప’ను విజయవంతం చేయాలని కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పేకాట శిబిరంపై దాడి

ఏలూరు టౌన్: స్థానిక తంగెళ్లమూడిలో పేకాట శిబిరంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. ఎస్పీ మేరి ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు ఎస్ఈబీ సీఐ ప్రసాద్‌కుమార్ తమ సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.20,900 నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై చర్యలు తీసుకునేందుకు ఏలూరు టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తాడువాయి హైస్కూల్‌లో కలిసిన 1998-99 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

జంగారెడ్డిగూడెం రూరల్: తాడువాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–1999 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. ఆనాటి మిత్రులతో గడిపిన క్షణాలను నెమరువేసుకున్నారు. ఆట, పాటలతో ఆనందంగా గడిపారు. అందరూ ఒకచోటు కూర్చొని సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

‘చలో విజయవాడ’ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హరికృష్ణ

లింగపాలెం: ఈనెల 19న విజయవాడలో భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని చలో విజయవాడ పోస్టర్లను బుధవారం దళిత అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్ పొలిమేర హరికృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుమారు 400 కోట్లు వెచ్చించి 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర నడిబొడ్డున ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం అని అన్నారు. విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి



అంకాలగూడెంలో మాట్లాడుతున్న నాయకులు

కొయ్యలగూడెం: భారతరత్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అంబేడ్కర్ అభిమానులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు విజయవాడ తరలిరావాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు పిలుపునిచ్చారు. అంకాలగూడెం గ్రామంలో బుధవారం ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ నివాసం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. ఈనెల 19వ తేదీన విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేయనున్నారన్నారు. స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ పేరిట నిర్మించిన ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం దేశానికే గర్వకారణం అన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మనమందరం భాగస్వాములు కావాల్సిందిగా కోరారు. దూలపల్లి కాంతారావు, చిడిపి రవి, తమ్మిర్చి బ్రహ్మన్న, గెల్లా ప్రసాద్, జొన్నకూటి పట్టియ్యా, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌బాబుకి సత్కారం



శ్రీనివాసపురంలో సాగర్‌బాబుని సత్కరించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: ఐఆర్ఎస్ (ఇండియన్ రెవెన్యూ సర్వీస్) ఉద్యోగాన్ని సాధించిన జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడెంకు చెందిన సాగర్‌బాబుని బుధవారం శ్రీనివాసపురంలో ఘనంగా సత్కరించారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు సాగర్‌బాబుకు దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఉన్నతమైన ఐఆర్ఎస్ ఉద్యోగాన్ని సాగర్‌బాబు సాధించడం అభినందనీయమన్నారు. ఇష్టపడి, కష్టపడి చదివే ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పోల్నాటి రాజా, పోల్నాటి నాని, హనుమంత్, యర్రమళ్ల శ్రీను, ప్రగడ మల్లేష్ పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గత నెల 28న ప్రారంభమైన శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు రోజు ఉదయం గంటలకు మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, గరుడ ధ్వజ అవరోహణ, చక్ర పెరుమాళ్లకు శ్రీ చక్రస్నానం నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం దెందులూరుకు చెందిన వై.పెద్దిరాజు బృందం నాదస్వర సమ్మేళనం నిర్వహించారు. రాత్రి దర్బారు సేవ, అనంతరం శ్రీవారి విశేష ఆరాధన, వేద పఠనం, వేద ఆశీర్వచనం, శ్రీవారి పవళింపు సేవ, దంపత్తాంబూల కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు కోసూరి సత్యనారాయణాచార్యులు విశేష పూజలు చేయగా, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం ఈవో నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.